క్లుప్తంగా

హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

చొప్పదండి: మండలంలోని రాగంపేట, ఆర్నకొండ గ్రామాల మధ్య పందివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ సింగిరెడ్డి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో రైతులు, ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, దశాబ్దాలుగా రాగంపేట రహదారి మధ్యలోని వాగు వర్షాకాలంలో ఉప్పొంగి ప్రవహిస్తోందని, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారని హైలెవల్ బ్రిడ్జి నిర్మించడంలో అధికారులు, ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. వెంతన లేక పోవడంతో బుధవారం రాత్రి ఓ గర్భిణిని కరీంనగర్ తీసుకెళ్లేందుకు వచ్చిన 108 వాహనం రామడుగు మండలం నుంచి ప్రయాణించాల్సి వచ్చిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించాలని అన్నారు.

పరిహారం ఇవ్వాలి

చొప్పదండి: వర్షాలకు ఇండ్లు కూలిపోయిన వారికి నష్ట పరిహారం ఇవ్వాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇండ్లు మళ్లీ కట్టుకోలేరని డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేసి న్యాయం చేయాలన్నారు.

కిసాన్ సమృద్ధి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మానకొండూర్: కిసాన్ సమృద్ధి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ రైతులను కోరారు. మండలంలోని గంగిపల్లి, గట్టుదుద్దెనపల్లి విశాల సహకార సంఘాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులకు ఇక్కడి నుంచి ఎరువులు అందజేస్తామని తెలిపారు. రైతులకు వ్యవసాయపరంగా సలహాలు సూచనలు ఇస్తామన్నారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగం టీవీల ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ఇఫ్కో జిల్లా మేనేజర్ కాగితం శివరాజ్, సంఘం అధ్యక్షులు పారిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరాజ్, రాజిరెడ్డి, నరేందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, ప్రభాకర్, ఎస్ఎఫ్ఏ సంతోష్, చంద్రమోహన్, సంజీవ్, గొర్రెంకల అయిలయ్య, పెంచాల శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆహార ప్యాకెట్లు



ఆహార ప్యాకెట్లు అందిస్తున్న అనిల్ గౌడ్

తిమ్మాపూర్: జోరువానకు వరద బాధితులను ఆదుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. బాధితులకు నేనున్నానని అండగా నిలిచారు మండలంలోని మన్నెంపల్లి ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్. గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. నీరు పోయేలా చర్యలు చేపట్టారు. స్థానిక యువకులతో కలిసి ధైర్యం చెప్పారు. బాధితులకు ఆహార ప్యాకెట్లు అందించారు. భయపడొద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం జగదీష్, గుంటి వెంకటేష్, కమేరా సంపత్, కొలిపాక కిరణ్,బూడిద కిషోర్,పారునంది స్వామి, పారునంది సంపత్,పారునంది పోచమల్లు,సుధగోని వేణు, బోయిని శ్రీకాంత్, సుదగోని సదయ్య,అషోధ అనిల్, అషోధా సతీష్,పారునంది ప్రశాంత్, చిట్టెల వినీత్, తదితరులు పాల్గొన్నారు.


టార్పాలిన్లు పంపిణీ



టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న అధికారులు

శంకరపట్నం: మండలంలో భారీ వర్షాలకు స్వల్పంగా ఇళ్లు కూలిన బాధితులకు గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి టార్పాలిన్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు బియ్యం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరొద్దీన్, ఏఈ తిరుపతి, ఎంపీటీసీ మోహీన్, శ్రీనివాస్, రెడ్‌క్రాస్‌సొసైటీ కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి, డైరెక్టర్ బోడ సుధాకర్,తదితరులు ఉన్నారు.

కనపర్తిలో కొండచిలువ ప్రత్యక్షం



వీణవంక: మండలంలోని కనపర్తి గ్రామంలో 10 ఫీట్ల కొండచిలువ ప్రత్యక్ష్యమవడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలోని రవి అనే వ్యక్తి ఇంటి ముందుకు కొండచిలువ రావడంతో స్థానికులు పరుగులు తీశారు. కొందరు యువకులు కొండచిలువను పట్టుకొని సమీపంలోని గుట్ట వద్ద వదిలేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

జలదిగ్బంధంలో గ్రామాలు

- జోరువానకు ఇళ్లలోకి నీరు
- కొట్టుకుపోయిన రోడ్లు, కల్వర్టులు
- స్తంభించిన రాకపోకలు, విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పొంగిపొర్లుతున్న వాగులు
- నిండుకుండలా చెరువులు, కుంటలు
- నీటమునిగిన పంటలు, ఆస్తి నష్టం
- సహాయక చర్యల్లో అధికారులు



ఇల్లందకుంట పీహెచ్‌సీ చుట్టూ వర్షం నీరు



శంకరపట్నం: లింగాపూర్‌లో నీటమునిగిన వరిపొలాలు

హుజూరాబాద్: ఎడతెరిపి లేని వర్షాలకు గ్రామాలు జలదిగ్బంధమయ్యాయి. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. హుజూరాబాద్‌లోని చిలుకవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో హిందూశ్మశాన వాటిక వద్ద రొడ్యాం వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వడ్డెర కాలనీతో పాటుగా, కనుకులగిద్ద , పెద్దపాపయ్యపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. పట్టణంలోని గుండ్ల చెరువులోకి వరదనీరు వెళ్లకుండా మున్సిపల్ అధికారులు చిలుకవాగులోకి మళ్లించారు. మున్సిపల్ సిబ్బంది వార్డు కౌన్సిలర్లు ఎక్కడికక్కడ సహాయక చర్యలు చేపట్టారు.

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ నుంచి పెద్దపాపయ్యపల్లికి వెళ్లే దారి పూర్తిగా వరద నీటితో నిండిపోవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. చెల్పూర్ గ్రామానికి వరద ముప్పు పొంచి ఉంది. పెద్దపాపయ్యపల్లి పాతలకుంట చెరువు కట్ట తెగడంతో వరద నీరు పొలాలోకి చేరుతోంది.ఐదు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రంగాపూర్ గ్రామానికి చెందిన పుర్రె ఓదెలు ఇంట్లోకి వరద నీరు చేరటంతో అగ్నిమాపక బృందం నీటిని తోడేశారు. కొత్తపల్లి గ్రామంలో నాగేశ్వర్ అనే వ్యక్తి నెయ్యి మిల్లులోకి వరదనీరు చేరటంతో రూ. లక్ష ఆస్తి నష్టం వాటిల్లింది.

జమ్మికుంట: పట్టణంలోని వరద ప్రభావిత కుటుంబాలను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆయాగ్రామాల చెరువులు తెగి ఇండ్లల్లో నీరు చేరే పరిస్థితిని గమనించి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు గండి పెట్టారు. వావిలాల మానేరు పరివాహక ప్రాంతంలో హైటెన్షన్ పోల్స్ నిర్మాణం కోసం జార్ఖండ్ నుంచి వచ్చిన వలసకూలీలు వరదలో చిక్కుకున్నారు. హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్, ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ రమేశ్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీటీసీ మర్రి మల్లేశం తాళ్ల సహాయంతో కాపాడారు. అత్యవసర పరిస్థితుల్లోనే ప్రజలు బయటకు రావాలని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

వీణవంక: బేతిగల్‌కు మూడు వైపులు రహదారుల పైకి వరదనీరు భారీగా చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. యాభైఏళ్లలో ఇలాంటి పరిస్థితి చూడలేదని గ్రామానికి చెందిన శ్రీరాం ఐలయ్య తెలిపాడు. నర్సింగాపూర్‌లో ఇళ్లలోకి వరద చేరడంతో ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించారు.

శంకరపట్నం: శంకరపట్నం, వీణవంక మండలాల వరప్రదాయిని కల్వల ప్రాజెక్ట్ నిండుకుంది. కట్టపై నుంచి నీరు కిందకు దూకుతోంది. గతంలో రింగ్‌బండ్ వేసిన చోట కట్టకు ప్రమాదం పొంచి ఉండడంతో ఇసుక బస్తాలు వేశామని డీఈ కవిత తెలిపారు. రాజాపూర్ దళితకాలనీలోకి వరదనీరు రావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. వరద ప్రభావిత ప్రాంతాలను హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై లక్ష్మారెడ్డి పరిశీలించారు. తాడికల్ సబ్‌స్టేషన్ పరిధిలో మూడు విద్యుత్‌స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ విరిగిపడినట్లు ఏఈ సంపత్‌రెడ్డి తెలిపారు. పది ఇండ్లు కూలినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు.

చిగురుమామిడి: ఇందుర్తి–ఓగులాపూర్ గ్రామాల మధ్య మోయతుమ్మెద వాగు జోరుగా ప్రవహిస్తుంది. వరద ఉధృతిని కరీంనగర్ ఏసీపీ కరుణాకర్‌రావు, తహసీల్దార్ జయంత్, ఎంపీడీవో నరసయ్య, ఎస్సై రమేష్ పరిశీలించారు. 27 ఇండ్లు కూలినట్లు తహసీల్దార్ తెలిపారు.

రామడుగు: రామడుగు, షానగర్ మధ్య బ్రిడ్జిపై నుంచి నీరు ఉప్పొంగి ప్రవహించింది. నాలుగేళ్లు అవుతున్నా బ్రిడ్జి పూర్తి కాకపోవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దత్తోజిపల్లిలో రోడ్డుకు కోతకు గురైంది. దేశ్‌రాజ్‌పల్లి చెరువు కట్టకు గండి పడటంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు గండిని పూడ్చారు.

చొప్పదండి: రాగంపేటలో పంది వాగు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండటంతో ఆర్నకొండ – గోపాల్‌రావుపేట రోడ్డు మూసివేశారు. చొప్పదండి కుడి చెరువు మత్తడి దూకుతుండటంతో గుమ్లాపూర్ ఎక్స్ రోడ్డులోని ఇండ్లలోకి నీరు చేరింది. మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ స్పందించి జేసీబీ సాయంతో చెత్త, నీటిని తొలగింపజేశారు.

గంగాధర: వెంకటాయిపల్లి వాగు ద్వారా నారాయణపూర్ చెరువులోకి భారీగా నీరు చేరుతుంది. చెరువు బ్యాక్ వాటర్‌తో చర్లపల్లి(ఎన్) గ్రామం చుట్టూ నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. హిమ్మత్‌నగర్ ఎస్సీ కాలనీలోకి వరద నీరు చేరింది. పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి పోయాయి.

గన్నేరువరం: గన్నేరువరం నుంచి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారిలోని గన్నేరువరం, జంగపల్లి, గునుకులకొండాపూర్, గుండ్లపల్లి, చొక్కారావుపల్లెలో కల్వర్టులను వరద ముంచెత్తింది. కరీంనగర్‌తో పాటు రాజన్నసిరిసిల్ల, వేములవాడలకు రాకపోకలు స్తంభించాయి. ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. ఎస్సై చందా నరసింహారావు పోలీస్ సిబ్బందితో రక్షణ చర్యలు చేపట్టారు.

మానకొండూర్: మండలంలోని లింగాపూర్– వెల్ది గ్రామాల మధ్య, గంగిపల్లి ఇసుక వాగు, చర్చి సమీపంలో, కెల్లెడ ఎస్సీ కాలనీ, ఈదులగట్టెపల్లి, రంగపేట పెద్దమ్మ ఆలయం సమీపంలోకి వరద నీరు రావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మానకొండూర్ పెద్ద చెరువులో మత్స్యకారులు చేపలు పట్టడంతో కొనుగోలుదారులతో చెరువు వద్ద సందడి నెలకొంది.

మానకొండూర్‌రూరల్: ఊటూర్‌లో ఇసుకరీచ్‌ల వద్ద వాహనాల కోసం ఇష్టారాజ్యంగా మట్టితో కట్టలు ఏర్పాటు చేయడంతో వర్షపు నీరు పంటపొలాలు, ఇండ్లలోనికి చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

సైదాపూర్: మండలంలో 201.8 మీ.మీ వర్షపాతం నమోదైంది. సోమారం ఆదర్శ పాఠశాల జలదిగ్బంధమైంది. 60 మంది విద్యార్థులు ఫస్ట్ ఫ్లోర్‌లో చిక్కుకున్నారు. స్థానిక వీఆర్‌ఏ కోటి సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గ్రామస్తుల సహాయంతో విద్యార్థులను వరద నుంచి తాడు ద్వారా దాటించగా తల్లిదండ్రులు తీసుకెళ్లారు. తొమ్మిది మంది విద్యార్థుల తల్లిదండ్రులు రాకపోవడంతో ఎస్ఐ ఆరోగ్యం తన వాహనంతో సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గర్రెపల్లి నేల కల్వర్టు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. తుమ్మల చెరువు కట్టు కాలువకుగండి పడే పరిస్థితిని గమనించి ఎస్ఐ ఆరోగ్యం, సిబ్బంది, స్థానికుల సహాయంతో మట్టి, ఇసుక బస్తాలు వేశారు.



గన్నేరువరం: జంగపల్లి-హన్మాజిపల్లె మధ్య కల్వర్టుపై



శంకరపట్నం: అర్కండ్ల వాగు ఉధృతి



మానకొండూర్: అన్నారం శివారులో..

ఇల్లందకుంట: మండలంలోని మల్యాలలో జిల్లాలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. రికార్డు స్థాయిలో మండల వ్యాప్తంగా 38.24 సె.మీ వర్షపాతం నమోదైంది. శ్రీరాములపల్లిలోని వరద బాధితులకు ఎస్సై రాజ్‌కుమార్ ఆహార ప్యాకెట్లు అందజేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ వర్షం నీరు రావడంతో సిబ్బంది, రోగులు ఇబ్బంది పడ్డారు. సిరిసేడు గ్రామంలోని సబ్‌స్టేషన్ నీటిలో మునగడంతో అర్ధరాత్రి నుండి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సిరిసేడు–మల్యాల రోడ్డు కోతకు గురైంది. శ్రీరాములపల్లిలోని లోతట్టుకాలనీలను ఏసీపీ జీవన్‌రెడ్డి, తహసీల్దార్ సురేఖ, జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్ లు పరిశీలించారు.



గంగాధర: హిమ్మత్‌నగర్‌లో ఇండ్లలోకి చేరిన వరదనీరు



సైదాపూర్: సోమారంలో పొంగిపొర్లుతున్న వాగు



హుజూరాబాద్-జూపాక ప్రధాన రహదారిపై వరదనీరు



ఇల్లందకుంట: మల్యాల వాగు వద్ద బ్రిడ్జిపై వరదనీరు

కల్వల ప్రాజెక్టు పరిశీలన



మత్తడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రసమయి

శంకరపట్నం: మండలంలో కల్వల ప్రాజెక్ట్‌ను గురువారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరిశీలించారు. వరద ఉధృతితో రాకపోకలు నిలిచిపోవడంతో టాటా ఏస్ వాహనంలో ప్రాజెక్టు కట్టపైకి చేరుకున్నారు. మత్తడిని పరిశీలించిన తర్వాత కల్వల ప్రాజెక్ట్ కట్ట ప్రమాదస్థాయికి చేరుకోవడంతో కట్టకు ముప్పువాటిల్లకుండా పర్యవేక్షించాలని డీఈ కవితకు సూచించారు. మండలంలో భారీ వర్షాలకు కూలిన ఇళ్లను పరిశీలించారు. జెడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, సర్పంచ్ భద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ ఉన్నారు.

మానకొండూర్: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల చెరువు, కుంటలను పరిశీలించారు. ప్రజలు ఇంటి వద్దనే ఉండాలని సూచించారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేస్తామని, కూలిపోయే ఇళ్లలో ఉండొద్దని సూచించారు. సమస్యలుంటే నేరుగా ఫోన్ లేదా వాట్సాప్ చేయాలని సూచించారు. వెంట జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, సర్పంచ్ పత్యీరాజ్ నాయకులు, తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



గంగాధర: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గంగాధర: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే బయటకు రావాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రజలకు సూచించారు. మండలంలోని బూర్గుపల్లి, లింగంపల్లి, ర్యాలపల్లి, చర్లపల్లి (ఆర్), కొండాయిపల్లి గ్రామాల్లో వరద ఉధృతిని పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. సమస్యలుంటే నాకు గానీ అధికారులకు సమాచారం ఇవ్వాలని 24 గంటలు అందరం అందుబాటులో ఉంటామన్నారు. నారాయణపూర్ చెరువుతో పాటు గ్రామాల్లోని చెరువులు, కుంటల కట్టల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండొద్దన్నారు. వర్షాలకు కూలిన ఇళ్లు, నీటమునిగిన పంట వివరాలు నమోదు చేయాలని సంబంధిత అధికారులు సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.

కూలిన చెట్ల తొలగింపు



తిమ్మాపూర్: మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. రాజీవ్ రహదారి, మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న చెట్లు నేలవాలాయి. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. చెట్లు, కొమ్మలు కరెంటు తీగలపై పడడంతో సుమారు పది గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తిమ్మాపూర్ లైన్‌మెన్, సిబ్బంది వర్షంలో చెట్లు, కొమ్మలను తొలగించారు. పలు గ్రామాల్లో ఎల్ఎండీ పోలీసులు రహదారిపై పడిన చెట్లను తొలగించారు. వర్షాల నేపథ్యంలో పోలీసులు, హెచ్‌కేఆర్ సిబ్బంది రాజీవ్ రహదారి వెంబడి తనిఖీ చేశారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

పాఠశాలల్లో వైద్య శిబిరాలు



జమ్మికుంట: మండలంలోని వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ సన జవేరియా ఆధ్వర్యంలో గండ్రపల్లి గ్రామంలోని గురుకుల పాఠశాల(బాలికల), మండలంలోని కేజీబీవీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, డ్రై డేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ అక్షయ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మంజుల, హెల్త్ ఎడ్యుకేటర్ రవీందర్, సూపర్‌వైజర్స్ స్వరూప, సదానందం సిబ్బంది పాల్గొన్నారు.

నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న శాంతికుమార్

చొప్పదండి: పట్టణంలో నీరు నిల్వకుండా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం వర్షాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలు విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగలు, తడిచిన స్విచ్ బోర్డులను ముట్టుకోవద్దని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు అధికారిని అందుబాటులో ఉంటారని, ఆరుగురితో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరదలపై ఎంపీపీ సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త వినీత

చిగురుమామిడి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, అందరూ అందుబాటులో ఉండాలని ఎంపీపీ కొత్త వినీత కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో వరదలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టాలని, గ్రామాలను విడిచి పంచాయతీ కార్యదర్శులు ఎక్కడికి వెళ్లొద్దన్నారు. మంచినీటి ట్యాంకులు శుభ్రం, దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పాక్షికంగా కూలిన ఇండ్ల వివరాలపై సమాచారం ఇవ్వాలని, నిరాశ్రయులకు తగిన వసతి కల్పించాలన్నారు. తెగిగ రోడ్లు, కుంటలు, ధ్వంసమైన పంటల వివరాలు ఇవ్వాలన్నారు. సమీక్షలో మండల ప్రత్యేకాధికారి, ఐబీడీఈఈ ప్రశాంత్, తహసీల్దార్ జయంత్, ఎంపీడీఓ నర్సయ్య, ఎంపీఓ శ్రావన్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్, ఎస్సై రాజేశ్, ఏఈలు రాజేశ్, వినయ్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మకు సాయంగా..



మానకొండూర్: మానకొండూర్ చెరువు కట్ట వద్ద చేపలు కొనుగోలు చేసిన వ్యక్తులు వాటిని శుభ్రం చేయించుకునేందుకు కట్ట వద్ద ఉన్న వారిని ఆశ్రయించారు. ఓ మహిళ వద్దకు చాలా మంది రావడంతో తల్లికి ఇబ్బంది అవుతుందనుకున్నాడో ఏమోగానీ ఓ పిల్లవాడు తల్లికి సహాయం చేయాలనుకొని చేపలను క్లీన్ చేస్తుండగా కొనుగోలుదారులు చూస్తూ అలాగే ఉండిపోయారు. ఈ దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో క్లిక్‌మనిపించింది.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి



అధికారులతో మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

వీణవంక: భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటూ సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని, మానేరు సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గురువారం మండల కేంద్రంలోని చెక్‌డ్యాం, వరద ఉధృతిని పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మరో రెండు రోజులు వర్షాలు ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. పాత ఇళ్లలో ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. వెంట సర్పంచ్ నీల కుమార్, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం



నినాదాలు చేస్తున్న కార్మికులు

జమ్మికుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె గురువారంతో 22వ రోజుకు చేరింది. జేఏసీ చైర్మన్ కొప్పుల శంకర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె మరింత ఉధృతం చేస్తామన్నారు. ఉద్యోగ భద్రత, మల్టీపర్పస్ జీవో రద్దు చేయాలని, రూ.పది లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎమర్జెన్సీ సర్వీసులను నిలిపేస్తామని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండిగ రవీందర్‌రావు, వాసాల సారయ్య, రాజు, రాజేష్, తిరుపతి, అశోక్‌కుమార్, అప్పాల ప్రవీణ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.